తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం - 05 - మే - 2026 | సంపుటి : 3 | సంచిక : 337 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# దేశ రాజకీయాల్లో కొత్త దిశ
# రాష్ట్రాలవారీగా విభిన్న తీర్పులు

అస్సాం, పుదుచ్చేరిలో బీజేపీ ప్రభంజనం

కేరళలో కాంగ్రెస్ దూకుడు.. తమిళనాడులో టీవీకే సంచలనం

పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ భారీ ఆధిపత్యం

**డెస్క్, మే 04 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):**

దేశంలోని పలు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు స్పష్టమవడంతో రాజకీయ పటంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రతి రాష్ట్రంలో ఓటర్లు ఇచ్చిన తీర్పు వేర్వేరు రాజకీయ ధోరణులను ప్రతిబింబిస్తూ, అభివృద్ధి, మార్పు, ప్రత్యామ్నాయాల వైపు ప్రజలు మొగ్గుచూపినట్లు ఫలితాలు తెలియజేస్తున్నాయి.

మిగతా 2లో..



## కేరళలో యూడీఎఫ్ విజయంపై రేవంత్ అభినందనలు

- అసాధారణ విజయం సాధించిన కాంగ్రెస్ కూటమి
- జాతీయ నేతలకు ప్రత్యేక అభినందనలు
- ప్రజాస్వామ్య విలువలకు ప్రజల మద్దతు స్పష్టం

**హైదరాబాద్, మే 04 (తెలంగాణ ముచ్చట్లు):**

కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి సాధించిన విజయంపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, కూటమి సాధించిన విజయం అసాధారణమని పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలుపుతూ రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, దీపాదాస్ మున్షీల పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించారు. తాను కేరళలో ప్రచారంలో పాల్గొన్న సమయంలో అక్కడి ప్రజలు చూపిన ఆదరణను గుర్తు చేసుకున్న ఆయన, యూడీఎఫ్ మద్దతుదారులకు కృతజ్ఞతలు తెలిపారు.
తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో ప్రగతిశీల విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి బలంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఈ రెండు రాష్ట్రాలు అభివృద్ధిని విశ్వసిస్తాయని, ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో ఎదుర్కొన్న సవాళ్లను అధిగమించి కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని అందించడంతో కొత్త భవిష్యత్తుకు నాంది పలికారని అన్నారు.

మిగతా 2లో..



## మోదీ సభ విజయానికి మల్కాజిగిరి నుంచి భారీ సమీకరణ

- ఎంపీ ఈటల రాజేందర్ పిలుపు
- కార్యకర్తల సమావేశంలో దిశానిర్దేశం
- లక్ష మందితో సభను విజయవంతం చేయాలని పిలుపు
- తెలంగాణలో బీజేపీ బలోపేతమే లక్ష్యం

2లో

విద్యుత్ అవకతవకలపై
## సీబీఐ దర్యాప్తు

సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కీలక నిర్ణయాలు

అకాల వర్షాల నష్టంపై రైతులకు సహాయం

భూముల ధరల సవరణ, సోలార్ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్



**హైదరాబాద్, మే 04 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో విద్యుత్ కొనుగోళ్లు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్రాజెక్టుల్లో అవినీతి ఆరోపణలపై జస్టిస్ మదన్ బి. లోకూర్ కమిషన్ సమర్పించిన నివేదికను ఆధారంగా తీసుకుని కేసును సీబీఐకి అప్పగించేందుకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది.
అంతర్రాష్ట్ర అంశాలు ఉండటం, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలతో సంబంధం ఉండటంతో నిష్పాక్షిక దర్యాప్తు అవసరమని కేబినెట్ అభిప్రాయపడింది.
సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

మిగతా 2లో..

## రైతుల పరిస్థితి దయనీయంగా మారింది..

సదాశివపేటలో కేటీఆర్ ఆవేదన

- కొనుగోలు కేంద్రంలో రైతులతో ప్రత్యక్షంగా చర్చ
- రైతుబంధు ఆలస్యంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు
- మద్దతు ధరకు పంటల కొనుగోలు చేయాలని డిమాండ్

**సంగారెడ్డి, మే 04 (తెలంగాణ ముచ్చట్లు):**



రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం ఎ. రేవంత్ రెడ్డి పాలనలో రైతులకు నష్టమే జరుగుతోందని ఆయన విమర్శించారు.

మిగతా 2లో..

## అకాల వర్షాలపై అప్రమత్తం

ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి చేయాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

జిల్లా కలెక్టర్లతో అత్యవసర వీడియో కాన్ఫరెన్స్.. రబీ సీజన్‌లో భారీ ధాన్యం రాకకు సన్నాహాలు

2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# దేశ రాజకీయాల్లో కొత్త దిశ

# రాష్ట్రాలవారీగా విభిన్న తీర్పులు

(మొదటి పేజీ తరువాయి)

అస్సాం రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ చరిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 126 స్థానాల్లో ఏకంగా 101 సీట్లు గెలుచుకుని పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ముఖ్యమంత్రి హిమంత బిస్వ శర్మ నాయకత్వంపై ప్రజలు మరోసారి విశ్వాసం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కేవలం 21 స్థానాలకు పరిమితమవగా, ఇతరులు 4 స్థానాల్లో మాత్రమే గెలుపొందడం గమనార్హం. పుదుచ్చేరిలో కూడా బీజేపీ ఘన విజయాన్ని సాధించింది. మొత్తం 30 స్థానాల్లో 17 సీట్లు గెలుచుకుని స్పష్టమైన మెజారిటీ దిశగా అడుగులు వేసింది. అభివృద్ధి, స్థిరత్వం అంశాలపై ప్రజలు మద్దతు ఇవ్వడం ఈ ఫలితాల్లో కనిపిస్తోంది. కేరళలో కాంగ్రెస్ పార్టీ భారీ విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 140 స్థానాల్లో 98 సీట్లు గెలుచుకుని అధికారంలోకి వచ్చింది. ఎల్డీఎఫ్ కూటమి 35 స్థానాలకు పరిమితమవగా, బీజేపీ 3 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. ప్రజలు మార్పు కోరుకుంటూ కాంగ్రెస్ వైపు మొగ్గుచూపినట్లు స్పష్టమైంది. తమిళనాడులో తమిళగ వెట్రి కళగం పార్టీ సంచలన విజయాన్ని నమోదు చేసింది. పార్టీ అధినేత విజయ్ నాయకత్వంలో టీవీకే 234 స్థానాల్లో 110 సీట్లు గెలుచుకుని కొత్త రాజకీయ శక్తిగా ఎదిగింది. అన్నాడీఎంకే 53 స్థానాలతో రెండో స్థానంలో నిలిచింది. పశ్చిమ బెంగాల్లో బీజేపీ ఘన విజయం సాధించి 294లో 200 స్థానాలు గెలుచుకుంది. తృణమూల్ కాంగ్రెస్ 87 స్థానాలకు పరిమితమవగా, కాంగ్రెస్ కేవలం 2 స్థానాల్లో మాత్రమే గెలుపొందింది. రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ఈ ఫలితాలు దేశ రాజకీయాల్లో కీలక మార్పులకు సంకేతాలుగా నిలుస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో అధికార పార్టీలపై విశ్వాసం కొనసాగగా, మరికొన్ని చోట్ల ప్రజలు స్పష్టమైన మార్పును కోరుకున్నారు. మొత్తం మీద, అభివృద్ధి, పారదర్శక పాలన, బలమైన నాయకత్వం వైపు ఓటర్లు మొగ్గు చూపినట్లు ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

# రైతుల పరిస్థితి దయనీయంగా మారింది..

## సదాశివపేటలో కేటీఆర్ ఆవేదన

(మొదటి పేజీ తరువాయి)

సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని శనగల కొనుగోలు కేంద్రాన్ని కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పంటలను కొనకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు ఎప్పుడూ సమయానికి ఇవ్వలేదని కేటీఆర్ ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మాయమాటలు చెప్పి మోసం చేసిందని మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో రైతులకు సమయానికి రైతుబంధు ఇచ్చిన చరిత్ర ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. పంటల కొనుగోలులో ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు సహాయం చేసిన ప్రభుత్వం అదే అని తెలిపారు. ప్రస్తుతం వరి, జొన్నలు, శనగ వంటి పంటలకు మద్దతు ధర ఇవ్వడం లేదని కేటీఆర్ విమర్శించారు. రైతుల పంటలను వెంటనే కొనుగోలు చేసి మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. వచ్చే వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అవసరమైతే నిరసనలు చేపట్టి ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు.

# అకాల వర్షాలపై అప్రమత్తం

**హైదరాబాద్, మే 04 (తెలంగాణ ముచ్చట్లు):**



రాష్ట్రంలో అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక సూచనలు జారీ చేశారు. రబీ 2025-26 సీజన్‌లో పెద్ద ఎత్తున ధాన్యం వచ్చే అవకాశమున్నందున మే నెలను కీలకంగా భావించి ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అంతరాయం లేకుండా సజావుగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసే ప్రమాదం ఉన్నందున రైతులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఈ సమీక్షలో గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, క్రీడలు శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో సమన్వయం కీలకమని మంత్రి పేర్కొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. మే నెల మొత్తం ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, గిడ్డంగులు సరిపడా ఉండేలా చూడాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు నిల్వ సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే ప్రక్రియలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని, లారీలు, గన్నీలు కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం సకాలంలో మిల్లులకు చేరేలా పర్యవేక్షణ పెంచాలని పేర్కొన్నారు. అకాల వర్షాల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా కొనుగోళ్లు పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు.

# మోదీ సభ విజయానికి మల్కాజిగిరి నుంచి భారీ సమీకరణ




**మేడ్చల్ మల్కాజిగిరి, మే 04 (తెలంగాణ ముచ్చట్లు):** మే 10న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న ప్రధానమంత్రి సభను విజయవంతం చేయడానికి మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో బీజేపీ శక్తి సమీకరణ ప్రారంభమైంది. ఈ క్రమంలో ఎంపీ ఈటల రాజేందర్ కొంపల్లిలో నిర్వహించిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని కీలక దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు, కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి, పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్తో కలిసి కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు. పెద్ద ఎత్తున ప్రజలను సభకు తీసుకురావాలని నాయకులు పిలుపునిచ్చారు.

గత పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీకి ప్రజలు మెజారిటీ ఇచ్చి గెలిపించిన విషయాన్ని ఈటల రాజేందర్ గుర్తు చేశారు. అదే ఉత్సాహంతో మళ్లీ ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతు తెలపాలని కోరారు.

తెలంగాణలో బీజేపీ గెలుపు సాధించాల్సిన అవసరం ఉందని, ఆ స్ఫూర్తిని నింపేందుకే మోదీ తెలంగాణకు వస్తున్నారని తెలిపారు. మల్కాజిగిరి నుంచే గత ఎన్నికల ప్రచారం ప్రారంభమైనట్లు గుర్తుచేసి, ఈసారి కూడా భారీ స్పందన చూపించాలని కార్యకర్తలకు సూచించారు. మల్కాజిగిరి నుంచి లక్ష మందిని సభకు తీసుకువస్తామని తాను మాట ఇచ్చానని, అందరూ పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సభ మోదీకి కూడా స్ఫూర్తిని, భరోసాను ఇవ్వాలని అన్నారు.

తెలంగాణలో కాషాయ జెండా ఎగరవేయడం లక్ష్యమని, పార్టీ బలంగా ఉంటే డబ్బు అవసరం లేదని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. మోదీ నిరంతరం పనిచేస్తున్న నాయకుడని, ఆయన స్ఫూర్తితో రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు డా. ఎస్ మల్లారెడ్డి, జిల్లా ఇంచార్జి ఎస్ మహేంద్ర, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మహిళా మోర్చా నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, స్థానిక నేతలు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. సభ విజయవంతం కోసం అందరూ సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు.

# కేరళలో యూడీఎఫ్ విజయంపై రేవంత్ అభినందనలు

(మొదటి పేజీ తరువాయి)

ఇదే విషయంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఈ విజయం ప్రజాస్వామ్య విలువలపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని తెలిపారు. యూడీఎఫ్‌కు కేరళ ప్రజలు ఇచ్చిన మద్దతు ఆనందదాయకమని పేర్కొన్నారు.

రాష్ట్ర మంత్రి అజారుద్దీన్ కూడా స్పందిస్తూ ప్రజలు చాలా స్పష్టమైన తీర్పు ఇచ్చారని అన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన అందించాలనే సంకల్పానికి ఈ విజయం బలాన్నిచ్చిందని అభిప్రాయపడ్డారు.

## విద్యుత్ అవకతవకలపై

# సీబీఐ దర్యాప్తు



(మొదటి పేజీ తరువాయి)

లోకూర్ కమిషన్ సమర్పించిన 114 పేజీల నివేదికపై అడ్వకేట్ జనరల్ సూచనలు, అభిప్రాయాలను పరిశీలించిన తర్వాత సీబీఐ విచారణకు అప్పగించాలని తేల్చారు. ఈ సందర్భంగా మంత్రులు నిర్ణయాలను మీడియాకు వివరించారు.

రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల పంటలకు నష్టం జరిగిన అంశంపై కూడా కేబినెట్ చర్చించింది. ఆయా జిల్లాల ఇంచార్జి మంత్రులు పరిస్థితిని సమీక్షించి, రైతులకు తక్షణ సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

భూముల మార్కెట్ విలువల్లో ఉన్న వ్యత్యాసాలను దృష్టిలో పెట్టుకుని ధరలను శాస్త్రీయంగా సవరించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రిజిస్ట్రేషన్ శాఖకు అనుమతులు ఇస్తూ, ఈ నెల చివరి వారంలో సవరించిన ధరలను అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించింది. భూములు కోల్పోతున్న నిర్వాసితులకు సరైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కూడా కేబినెట్ స్పష్టం చేసింది.

అదేవిధంగా, రాష్ట్రంలోని ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలను 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించింది. నల్గొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘాన్ని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డుకు అప్పగించే ప్రతిపాదనకు కూడా ఆమోదం తెలిపింది. శక్తి రంగంలో భాగంగా 33/11 కేవీ సబ్ స్టేషన్ల సమీపంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పైలెట్ ప్రాజెక్టుగా 18 చోట్ల రూ.66.50 కోట్లతో 19 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులు అమలు చేయాలని నిర్ణయించింది.

అదనంగా, గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పరిధిలో పెండింగ్ పన్నుల క్లియరెన్స్ కోసం వన్ టైమ్ సెటిల్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. అలాగే రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో ఆధునిక కూరగాయల మార్కెట్ కోసం భూమి కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తంగా ఈ మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు పరిపాలనలో పారదర్శకత, అభివృద్ధి, రైతుల సంక్షేమం వైపు ప్రభుత్వం దృష్టిసారించినట్లు స్పష్టంగా తెలియజేస్తున్నాయి.




## గ్రామీణ ప్రతిభకు బంగారు వేదిక..

# రాంపూర్‌లో హాకీ సమ్మర్ క్యాంప్ జోష్!

**హుజురాబాద్ టౌన్ మే 04 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ మండలం రాంపూర్ గ్రామం క్రీడా కాంతులతో కళకళలాడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలనే లక్ష్యంతో ఉచిత హాకీ వేసవి శిక్షణ శిబిరం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. రాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సీనియర్ హాకీ కోచ్ పల్లపు సాంబరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని సర్పంచ్ ముషం సంగీత, గణేష్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... "గ్రామీణ క్రీడాకారులకు సరైన దారి, శిక్షణ ఇస్తే వారు రాష్ట్రం, దేశం స్థాయిలో మెరిసే సామర్థ్యం కలిగినవారే" అని నమ్మకంగా చెప్పారు. వేసవి శిబిరాలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, జట్టు భావన, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని తెలిపారు.

ప్రస్తుతం శిబిరంలో పాల్గొంటున్న బాలురు, బాలికలు ప్రతిరోజూ హాకీ ప్రాథమిక నైపుణ్యాలు, ఫిట్‌నెస్, ఆట నియమాలపై కఠినంగా శిక్షణ పొందుతున్నారు. కోచ్ సాంబరాజు మార్గదర్శకత్వంలో పిల్లల్లో క్రీడాస్ఫూర్తి మరింత పెరుగుతోంది.

క్రీడాకారులకు అండగా దాతలు

శిబిరానికి మరింత ఉత్సాహం నింపుతూ పలువురు దాతలు ముందుకు వచ్చారు. మాటూరి సారయ్య జ్ఞాపకార్థం ఆయన మనవరాలు అవిజ్ఞ సుహాసిని 15 టీషర్ట్లు అందించగా, సీనియర్ క్రీడాకారుడు భూసారపు శంకర్ మరో 15 టీషర్ట్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా హాకీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, హుజురాబాద్ హాకీ క్లబ్ కార్యదర్శి బొడిగ తిరుపతి, పీఈటీలు వేముల రవికుమార్, సాదుల శ్యామ్ కుమార్, సీనియర్ క్రీడాకారులు సజ్జు, రాజు, రాజేష్, సాయి కృష్ణ, ఉప సర్పంచ్ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

రాంపూర్‌లో ప్రారంభమైన ఈ హాకీ శిబిరం... చిన్నారుల కలలకు పెద్ద దారిని చూపిస్తోంది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# ప్రాధాన్య అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి...

◆ జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**ఖమ్మం బ్యూరో , మే-04(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రాధాన్య అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో చేపట్టిన ప్రాధాన్య అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇల్లందు రోడ్ వద్ద ఉన్న నిర్మాణాన్ని రేనోవేషన్ చేసి ఫ్రూట్ మార్కెట్ స్థాపనకు సంబంధించిన ప్రతిపాదనలు సమయానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఫ్రూట్ మార్కెట్ కాంపౌండ్ వాల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించి నిధులు మంజూరు పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. శిల్పారామం కోసం ఇప్పటికే 9 ఎకరాలు ఇవ్వడం జరిగిందని, అదనంగా 3 ఎకరాలు 21 గుంటలు అవసరమని, వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను సమయానికి పూర్తి చేయాలని, సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని తెలిపారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనుల్లో భాగంగా ప్రధాన సీవరేజ్ పైపులైన్ పనులను వేగవంతం చేయాలని, మొత్తం 8.5 కి.మీ పైపులైన్‌లో ఇప్పటికే 7.7 కి.మీ పూర్తి అయినందున మిగిలిన పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథతో ఎటువంటి మిక్సేజ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ధంసలాపురం వద్ద ఎస్టీపీ పనులు త్వరలో ప్రారంభించాలని తెలిపారు. హరిత హోటల్ నిర్మాణానికి భూమి అప్పగించడం జరిగిందని, వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో పెండింగ్ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్యాకేజీ 9లో కొంత మేరకు భూసేకరణ సమస్య ఉందని, స్థానికులతో చర్చించి త్వరగా పరిష్కరించాలని, తహసీల్దార్, సబ్ కలెక్టర్‌ను భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, సంబంధిత జిల్లా అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.





# రైతు కష్టానికి అండగా సిపిఐ కొనుగోలు వెంటనే ప్రారంభించాలి

◆ సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి

**ఎల్కతుర్తి, మే 04 (తెలంగాణ ముచ్చట్లు);** ఎల్కతుర్తి మండలంలో మక్కల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రైతులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. పంట పండించినప్పటికీ సరైన ధర లభించకపోవడం, కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రైతులు ధర్నా, రాస్తా రోకో నిర్వహించి తమ నిరసనను తెలియజేశారు. రహదారిపై కూర్చొని వాహన రాకపోకలను అడ్డుకోవడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ, "రైతు కష్టానికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. మక్కల కొనుగోలు వెంటనే ప్రారంభించి రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలి. లేకపోతే సిపిఐ పార్టీ రైతులతో కలిసి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుంది," అని హెచ్చరించారు.

రైతులు మాట్లాడుతూ, విత్తనాలు, ఎరువులు, కార్మిక ఖర్చులు పెరిగినా మక్కలకు మాత్రం సరైన ధర దక్కడం లేదని తెలిపారు. మధ్యవర్తులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తుండటంతో నష్టాలు చవిచూస్తున్నామని వాపోయారు. గోదాముల సదుపాయం లేకపోవడంతో పంటను నిల్వ చేసుకోలేక తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. అకాల వర్షాల కారణంగా పంట నాణ్యత తగ్గిపోవడం కూడా రైతులకు మరింత నష్టాన్ని కలిగిస్తున్నదన్నారు.

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరి రాములు మాట్లాడుతూ, "రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి. కొనుగోలు కేంద్రాలు ఆలస్యం చేయకుండా ప్రారంభించి రైతులకు న్యాయం చేయాలి," అని డిమాండ్ చేశారు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. రైతుల సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ రైతులు తమ డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరి రాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, సిపిఐ మండల కార్యదర్శి శనగరపు రాజ్ కుమార్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి గడ్డం రాజా, నర్సు, తండ మొండయ్య, సూర మొగిలి, అంబాల స్వామి, ఇంజాల పోశయ్య, పిన్ రెడ్డి మోహన్ రెడ్డి, మరి పెల్లి తిరుమల, గడ్డం లలిత తదితరులు పాల్గొన్నారు.





# యువతకు గోల్డెన్ ఛాన్స్...హ్యాండ్‌బాల్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం!

**జమ్మికుంట టౌన్ మే 04 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరం ఘనంగా ప్రారంభమైంది. ఈ శిబిరాన్ని కోరపల్లి సర్పంచ్ మధుసూదన్, ఉప సర్పంచ్ రాజు యాదవ్, గ్రామపంచాయతీ కార్యదర్శి కె. తారక రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మరియు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి జి. శ్రీను మాట్లాడుతూ, మే 1 నుంచి 31 వరకు జరిగే ఈ శిబిరంలో 10 నుంచి 16 సంవత్సరాల మధ్య వయస్సు గల బాల బాలికలు పాల్గొనవచ్చని తెలిపారు. ఉప సర్పంచ్ రాజు యాదవ్ మాట్లాడుతూ, కోరపల్లి గ్రామంతో పాటు సమీప గ్రామాల విద్యార్థులు ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. మంచి ప్రదర్శనతో రాష్ట్ర, జాతీయ స్థాయిలకు ఎంపికై గ్రామానికి, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే శిబిరంలో పాల్గొనే విద్యార్థులకు టీషర్ట్స్, షార్ట్‌లు అందజేయనున్నట్లు సర్పంచ్ మధుసూదన్ తెలిపారు. గ్రామపంచాయతీ కార్యదర్శి కె. తారక రామారావు మాట్లాడుతూ, క్రీడాకారులకు విద్య, ఉద్యోగాల్లో 2 శాతం స్పోర్ట్స్ కోటా ఉన్నందున దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు జాతీయ స్థాయి క్రీడాకారులు చక్రధర్, హరి ప్రసాద్ పాల్గొన్నారు.



# వంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

## ఏఐకేఎస్ డిమాండ్

**ఖమ్మం బ్యూరో, మే 4(తెలంగాణ ముచ్చట్లు ):** పాతర్లపాడు గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో పంట కాలిపోయిన మొక్కజొన్న రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐకేఎస్ ఖమ్మం జిల్లా గౌరవ అధ్యక్షులు ఏపూరి రవీంద్రబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం పాతర్లపాడు గ్రామంలో ఏఐకేఎస్ చింతకాని మండల ప్రతినిధి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఏపూరి రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యంతోనే మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కొనుగోలు కేంద్రాల పేరుతో రైతులను దగా చేస్తున్నారన్నారు. బస్తాలు మొదలుకొని, కాటాలు, చివరకు లారీల వరకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వేసవి కాలం కావడంతో అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటుంటే రైతులు రాత్రిళ్ళు సైతం కాటాలు వేసిన బస్తాలకు కావిలి కాయల్సివస్తుందన్నారు. కాటాలు వేసిన బస్తాలను గోడౌన్కు తరలించడానికి బస్తాకు రూ.40 నుంచి 50 వరకు డిమాండ్ చేస్తున్నారని దీంతో గత్యంతరం లేక రైతులు చెల్లిస్తున్నారని, పాతర్లపాడులో జరిగిన ప్రమాదంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని తక్షణమే అధికారులు పంట నష్టం వివరాలు ప్రభుత్వానికి పంపి నష్టపరిహారం అందేలా చూడాలన్నారు. తక్షణమే అధికారులు స్పందించి కాటాలు వేసిన మొక్కజొన్నను గోడౌన్‌కు తరలించాలని పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రమాదంలో గొర్రెలు కూడా అగ్నికి ఆహుతయ్యాయని గొర్రెల కాపరికి కూడా నష్టపరిహారం అందేలా చూడాలని లేని పక్షంలో రైతులు తరపున ఏఐకేఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు పావులూరి మల్లిఖార్జునరావు, ఏఐకేఎస్ మండల కార్యదర్శి పదిమల వెంకటనర్సయ్య, నాయకులు తాళ్లూరి యాదగిరి, కొత్తపల్లి రమేష్, గడ్డం సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

# రెండు ఏళ్ల సేవలకు గౌరవం... కమిషనర్ అయాజ్‌కు సత్కారం

**జమ్మికుంట టౌన్ మే 04 (తెలంగాణ ముచ్చట్లు):**

జమ్మికుంట మున్సిపాలిటీలో గత రెండు సంవత్సరాలుగా సేవలు అందిస్తూ పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్‌కు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.

మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఆయనను సత్కరించారు. కమిషనర్‌గా ఉన్న కాలంలో పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి అన్ని రంగాల్లో ముందుకు



తీసుకెళ్లారని కొనియాడారు. ముఖ్యంగా ఇంటి పన్ను వసూళ్లలో జమ్మికుంటను రాష్ట్ర స్థాయిలో రెండు సార్లు ముందంజలో నిలిపిన నాయకత్వం ఆయనదేనని అభినందించారు. ఈ సందర్భంగా తోటి అధికారులు మాట్లాడుతూ, అధికారి అయినప్పటికీ సిబ్బందితో స్నేహపూర్వకంగా, ఆప్యాయంగా మెలిగి అందరినీ ఒక కుటుంబంలా చూసుకున్నారని గుర్తు చేసుకున్నారు. తమ పనిని గుర్తించి ప్రోత్సహిస్తూ అవార్డులు అందించారని తెలిపారు. ఆయన సేవలు ఎప్పటికీ మరువలేమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి. రాజిరెడ్డి, జె.ఏ.ఓ రాజశేఖర్ రెడ్డి, టిపివో శ్రీధర్, టిపిఎస్ రాజ్ కుమార్, ఆర్ఐ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్లు వాణి, శ్రీనివాస్, ఫష్ బోలా సదానందం తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

**అక్రమ రవాణా జరిగితే 8712659111 కు సమాచారం ఇవ్వాలి: పోలీస్ కమిషనర్ సునీల్ దత్**



**ఖమ్మం బ్యూరో, మే 4(తెలంగాణ ముచ్చట్లు ):** ఆవులు, దూడల అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, వ్యక్తిగత దాడులకు పాల్పడడం చట్టరీత్యా నేరమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. పశువుల రవాణాకు సంబంధించిన నిబంధనలు, చట్టపరమైన అంశాలపై గో రక్షణ కమిటీ తో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... గో రక్షకుల పేరుతో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోని దాడులు చేయడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు వుంటాయని అన్నారు.పశువుల అక్రమ రవాణాను గమనిస్తే, వెంటనే 8712659111 కు, స్థానిక పోలీసులకు, డయల్ 100 కు సమాచారం అందించి సహకరించాలన్నారు.

ఇప్పటికే జిల్లా సరిహద్దులో ఏడు చెక్ పోస్ట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువుల అక్రమ రవాణాను నిరోధించి, పట్టుబడిన పశువులను దగ్గరలోని గోశాలలకు తరలించాలని ఆదేశించామన్నారు. ఆవులు, దూడల అక్రమ రవాణా, అమ్మకం లేదా వధకు వ్యతిరేకంగా సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని అన్నారు. చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా జంతువుల కదలికలను పర్యవేక్షించడానికి అధికారులు మూడు షిఫ్టులలో చెక్‌పాయింట్‌లను ఏర్పాటు చేసారని అన్నారు. పశువుల రవాణాదారులు అందరూ పశువైద్యుల నుండి చెల్లుబాటు అయ్యే ధృవపత్రాలు, అధికారిక రవాణా రసీదులను కలిగి ఉండాలన్నారు. శాంతిని కాపాడటానికి జంతు సంక్షేమ నిబంధనలను పాటించడానికి పరిపాలనకు సహకరించాలని సంబంధిత వర్గాలందరికీ విజ్ఞప్తి చేశారు. ఏమైనా సమస్యలుంటే స్థానిక పోలీసులకు తెలియజేయాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తును పటిష్టం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏసీపీలు రమణమూర్తి, తిరుపతి రెడ్డి, మహేష్, సిఐ లు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## వ్యాపారులు సిసిటివి కెమెరాలను, ఆటోమాటిక్ అలారం సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలి

**పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

**ఖమ్మం బ్యూరో, మే 4(తెలంగాణ ముచ్చట్లు ):** నగల దుకాణాల పరిసరాల్లో అత్యున్నత నాణ్యత గల సిసిటివి కెమెరాలను,ఆటోమాటిక్ అలారం సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు.

ఆదివారం కరీంనగర్‌లో పిఎంజె జ్యువెలర్స్‌లో జరిగిన దోపిడీ, కాల్పుల ఘటన నేపథ్యంలో ఖమ్మం నగరంలోని నగల దుకాణాల యజమానులతో, షోరూం దుకాణాల ప్రతినిధులతో సమన్వయ సమావేశం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. సమావేశం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... నగల దుకాణాల్లో భద్రతతో పాటు సీసీటీవీ నిఘా, అలారం వ్యవస్థలు, యాక్సెస్ కంట్రోల్ వంటి ఆధునిక భద్రతా ఏర్పాట్లు పెంచాలని సూచించారు. అదేవిదంగా మెటల్ డిటెక్టర్ పరికరాలను అమర్చుడం ద్వారా భద్రతా ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. నగల దుకాణాల వద్ద భద్రతను విధిగా సమీక్షించాలని పోలీస్ అధికారులకు సూచించారు. అదేవిదంగా పగలు, రాత్రివేళల్లో ఆయుధాల కలిగిన పోలీస్ బృందాలతో ప్రత్యేక గస్తీ నిర్వహిస్తూ.. నిఘాను పెంచాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో సైతం ఇటువంటి దోపిడీ ఘటనలు తరచూ జరుగుతున్న నేపథ్యంలో పునరావతం కాకుండా అడ్డుకునేందుకు నిరంతరం అప్రమత్తం ఉండాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100కు డయల్ చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఏసీపీలు రమణమూర్తి, తిరుపతి రరెడ్డి, ఎస్బి ఏసీపీ మహేష్, సిఐలు కరుణాకర్, మోహన్ బాబు, బాలకృష్ణ, మురళి, సంజీవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

- **ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టి మిల్లులకు తరలించాలి**
- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల.మే 4(తెలంగాణ ముచ్చట్లు):** టీవల కురిసిన వర్షాల కారణంగా సోమవారం మందమర్రి మండలంలోని సారంగపల్లి, బొక్కలగుట్ట ప్రాంతాలలోని వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి తడిసిన దాన్యాన్ని ఆరబెట్టి త్వరగా మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు, ఇటీవల కురిసిన వర్షాలకు తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టి కేటాయించిన మిల్లులకు త్వరగా తరలించాలని నిర్వాహకులకు సూచించారు, ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు, రైతులు ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు,

రైతు యొక్క వివరాలను సిస్టం లో నమోదు చేసి ఆధార్ కార్డు ద్వారా వారి గుర్తింపును దృవీకరించాలని, రైతు భూమి విస్తీర్ణం, పండించిన ధాన్యం వివరాలను సరి చూడాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా పరిశీలించాలని తెలిపారు, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు.

## ఎస్సీ అట్రాసిటీ బాధితులకు వెంటనే పారితోషికాలు



- **కలెక్టర్ ఆదర్శ సురభికి వినతిపత్రం అందజేత**
- **ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు భోజరాజు**

**వనపర్తి,మే04(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లాలోని ఎస్సీ అట్రాసిటీ కేసుల బాధితులకు ఇప్పటివరకు అందని పారితోషికాలను వెంటనే విడుదల చేసి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి కు వనపర్తి జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మరియు జాతీయ మాలల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు మాదారి భోజరాజు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు మద్దెల కర్ణాకర్, కార్యవర్గ సభ్యులు బందారు రాజకుమార్, బీజ్జా ఆంజనేయులు, కురిటీ రమేష్ పాల్గొన్నారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కలెక్టర్ సమస్యపై సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

# క్లబ్‌పై ఆడిటింగ్ జరపాలి..

### టిడబ్ల్యూజేఎఫ్ డిమాండ్



**ఖమ్మం బ్యూరో, మే 4(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గత పది సంవత్సరాలుగా జరుగుతున్న ఆర్థిక వ్యవహారాలపై ఆడిటింగ్ చేపట్టడంతో పాటు ప్రెస్ క్లబ్ నిర్వహణ పారదర్శకంగా సాగేందుకు ఎన్నికలు నిర్వహించాలని అలాగే అవకతవకలకు తావులేకుండా అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్ హెచ్ 2843), ఖమ్మం జిల్లా కమిటీ జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకరకు సోమవారం వినతిపత్రాలు సమర్పించింది.

గత పది సంవత్సరాలుగా ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఓ రెండు యూనియన్లకు సంబంధించిన జర్నలిస్టులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రెస్ క్లబ్ నిర్వహణ పారదర్శకంగా ఉండకుండా చేస్తున్నారని తెలిపింది. ప్రెస్ మీట్ నిర్వాహకుల వివరాలు, ఆదాయం, ఖర్చులు వాటికి సంబంధించిన బిల్స్ చూపకుండా అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించింది. ప్రశ్నించిన వారిని టార్గెట్ చేస్తూ ప్రజాస్వామ్య బద్ధంగా ఉండాల్సిన ప్రెస్ క్లబ్ ను భ్రష్టు పట్టిస్తున్నారని, ప్రెస్ క్లబ్ పేరు చెప్పుకొని వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించింది.

జర్నలిస్టు వృత్తికే మచ్చ తెస్తున్న ఇటువంటి వ్యవహారాలపై చర్యలు తీసుకోవాలని కోరింది. క్లబ్ నియమ నిబంధనల మేరకు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆడిటింగ్ చేయాల్సిందిగా టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఖమ్మం ప్రెస్ క్లబ్ పై గుత్తాధిపత్యం చెలాయిస్తున్నవారు చివరకు కలెక్టర్ కు ప్రెస్ క్లబ్ పై ఉన్న అధికారమేంటని.. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వరకు పరిస్థితి వచ్చిందని టీడబ్ల్యూజేఎఫ్ టీడబ్ల్యూజేఎఫ్ బృందం కలెక్టర్ దృష్టికి తెచ్చింది.

ఖమ్మం ప్రెస్ క్లబ్ నిర్వహణ సక్రమంగా సాగాలంటే ఆడిటింగ్ ప్రక్రియ చేపట్టడంతో పాటు నియమ నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది. అలాగే అక్రిడిటేషన్ ల కేటాయింపులో అవకతవకలకు తావు లేకుండా చూడాలని కోరింది. అనర్హులు ఏ ఒక్కరికీ అక్రిడిటేషన్ కేటాయించొద్దని, అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలని టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి చేసింది. నిబంధనల పేరుతో పెద్ద పత్రికలను ఇబ్బందులు పెట్టొద్దని, రకరకాల సర్టిఫికెట్ల పేరుతో అక్రిడిటేషన్ లలో కోత విధించొద్దని కోరింది. డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ లు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. ఈ విషయమై రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి సైతం తీసుకువెళ్లినట్లు టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి చెప్పారు. స్పందించిన కలెక్టర్ డీపీఆర్వో, డీసీవోలకు చర్యల నిమిత్తమై ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దువ్వా సాగర్, ఆవుల శ్రీనివాస్, మానుకొండ రవికిరణ్, మధుశ్రీ, జానీపాషా, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, దగ్గుబాటి మాధవరావు, ఎన్. రామచంద్రమూర్తి, ఫయాజ్, అర్షద్, పాషా, గణేష్, కొరెకొప్పుల రాంబాబు, గోపి, కిరణ్, డి. రవికుమార్, ఉప్పలయ్య, వి. అంజయ్య పాల్గొన్నారు.

# బుగ్గవాగు చెక్ డ్యాం సవరించిన అంచనాలకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్

- **సీఎం రేవంత్, మంత్రి మండలికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు**
- **కామేపల్లి, రఘునాథపాలెం మండలాలకు మహార్దశ**



**ఖమ్మం బ్యూరో , మే 4(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం జిల్లాలో సాగునీటి రంగానికి బలాన్నిచ్చే బుగ్గవాగు ఎడమ వరద కాలువ పనుల సవరించిన అంచనాలకు రాష్ట్ర క్యాబినెట్ ఈ రోజు ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు మంత్రిమండలికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టు అమలుతో కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లో వ్యవసాయ రంగానికి నూతన దశ ప్రారంభమవుతుంది.

బుగ్గవాగు ఆనకట్ట నుంచి ఎడమ వరద కాలువ, బ్రాంచ్ కాలువల నిర్మాణం, అనుబంధ సివిల్ పనుల కోసం మొత్తం రూ.88.42 కోట్ల సవరించిన పరిపాలనా అనుమతికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రారంభ అంచనా రూ.39.21 కోట్లుగా ఉన్నప్పటికీ, ప్రాజెక్టు రూపకల్పనలో సాంకేతిక మార్పులు, ఆధునికీకరణ కారణంగా వ్యయం పెరిగింది. తాజా అంచనాల ప్రకారం పనుల ఖర్చు రూ.53.29 కోట్లు, పన్నులు రూ.21.23 కోట్లు, భూసేకరణకు రూ.10.71 కోట్లు, ఇతర వ్యయాలకు రూ.3.19 కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్టు అమలుతో కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లోని 13 గ్రామాలకు చెందిన 31 చెరువులను వరద నీటితో నింపే అవకాశం లభిస్తుంది. దాదాపు 2,866 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరగనుండటంతో, రైతులకు నిత్య సాగునీటి భరోసా కలుగుతుంది. ఇది వ్యవసాయ ఉత్పాదకత పెంపుకు, రైతుల ఆదాయ వృద్ధికి దోహదం చేయనుంది. గతంలో భూసేకరణ సమస్యలు, రైతుల అభ్యంతరాల కారణంగా ఈ పనులు నిలిచిపోయిన నేపథ్యంలో, మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవతో ప్రాజెక్టు రూపకల్పనలో కీలక మార్పులు చేశారు. ఓపెన్ కాలువ తవ్వకానికి బదులుగా భూగర్భ పైపులైన్ (గ్రావిటీ మెయిన్) విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా భూసేకరణ అవసరం 232 ఎకరాల నుంచి కేవలం 51 ఎకరాలకు తగ్గింది. దీంతో రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రాజెక్టు అమలు సాధ్యమవుతోంది.

ఈ కాలువ పనులు చేపట్టడం వలన నూతనంగా కామేపల్లి మండలంలో 23 చెరువులు, రఘునాథపాలెం మండలంలో 8 చెరువులను ఈ కాలువ ద్వారా వరద నీటితో నింపి, రైతులకు సాగునీటిని అందించవచ్చు. ప్రస్తుతం రఘునాథపాలెం మండలంలోని చెరువులకు మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందుతున్నప్పటికీ, ఎత్తిపోతల కోసం ప్రభుత్వానికి విద్యుత్ ఖర్చు భరించాల్సి వస్తుంది. బుగ్గవాగు ఎడమ కాలువ పూర్తయిన తర్వాత, గ్రావిటీ విధానంలోనే నీరు సరఫరా అవ్వడం వల్ల విద్యుత్ వినియోగం పూర్తిగా తగ్గి, ప్రభుత్వానికి గణనీయమైన ఆర్థిక ఆదా కలుగుతుంది. ఈ ప్రాజెక్టు అమలుతో కామేపల్లి మండలంలోని 23 చెరువులు, రఘునాథపాలెం మండలంలోని 8 చెరువులు మరియు మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ద్వారా నింపబడే చెరువులు నింపబడుతూ, రఘునాథపాలెం మండలం మొత్తం ప్రాంతం సస్యశ్యామలం వైపు దూసుకెళ్లనుంది. దీని ఫలితంగా పంటల విస్తీర్ణం పెరగడం, పంటల వైవిధ్యం పెరగడం, రైతుల జీవన ప్రమాణాలు మరియు ఆర్థిక పరిస్థితులు మెరుగుపడడం వంటి అనేక ప్రయోజనాలు కలగనున్నాయి.

ఈ ప్రాజెక్టు అమలులో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. క్యాబినెట్ ఆమోదంతో పనులు వేగవంతం కానుండగా, ఖమ్మం జిల్లాలో సాగునీటి వనరులు మరింత బలోపేతం కావడంతో పాటు రఘునాథపాలెం మండలం సస్యశ్యామలంగా మారే దిశగా కీలక అడుగు పడినట్లైంది.

# ఖమ్మం జిల్లా జర్నలిస్టుల అక్రిడిటేషన్ అక్రమాల పై విచారణ చేపట్టాలి

- **జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్ కు టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి**



**ఖమ్మం బ్యూరో,మే 04(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం జిల్లాలో 202628 సంవత్సరం మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల నియామకం, అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, దీనిపై సమగ్ర విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపకులు మామిడి సోమయ్య, ఖమ్మం యూనియన్ నాయకులను కోరారు.

ఈ మేరకు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నగేష్ ల నేతృత్వంలో ప్రతినిధి బృందం ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

మీడియా అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో, ఖమ్మం జిల్లాలో కమిటీ నియామకం, దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత లోపించిందని, నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని,ముఖ్యంగా, ఖమ్మం జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల నియామకంలో అన్ని జర్నలిస్టు సంఘాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించకుండా, ఒకే యూనియన్ కు చెందిన పలువురికి ప్రాధాన్యత ఇచ్చినట్లు అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని, కమిటీ నియామకం ప్రక్రియపై ముందస్తుగా ఎలాంటి అధికారిక నోటీసు లేదా సమాచారం ఇవ్వకుండానే గోప్యంగా నిర్వహించినట్లు జర్నలిస్టు వర్గాల్లో అనుమానాలు నెలకొన్నాయని, వారు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు.

అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఆన్లైన్ లో దాఖలు చేయబడిన దరఖాస్తుల పరిశీలనలో అనర్హమైన దరఖాస్తులకు కూడా ఆమోదం తెలిపినట్లు సమాచారం అందుతోందని, ప్రభుత్వ జీవో నెం. 252 ప్రకారం నిర్దేశించిన ప్రమాణాలు, పత్రికల ప్రామాణికత, సర్క్యులేషన్ ఆధారాలు, సంస్థ అనుమతులు, నియామక పత్రాలు, అనుభవ ధృవీకరణ పత్రాలు, పే స్లిప్పులు వంటి ముఖ్యమైన పత్రాలను సమగ్రంగా పరిశీలించకుండానే అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలుస్తోందని, వాటిని బహిర్గతం చేస్తూ చర్యలు చేపట్టాలని కోరారు. వెరిఫికేషన్ ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించకుండా తూతూ మంత్రంగా పూర్తి చేసినట్లు, మీడియా రంగంపై సరైన అవగాహన, ఫీల్డ్ అనుభవం లేని వారిని కూడా అర్హులుగా పరిగణించినట్లు అభ్యంతరాలు ఉన్నాయని, ఈ పరిణామాల వల్ల నిజంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు అన్యాయం జరిగే అవకాశం ఉందనివారు ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల పై అంశాలపై సమగ్ర విచారణ జరిపించి, నిబంధనలకు విరుద్ధంగా ఆమోదించబడిన దరఖాస్తులను పునఃపరిశీలించి, అర్హులైన, నిజమైన మీడియా ప్రతినిధులకు మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు జారీ అయ్యేలా, భవిష్యత్తులో మీడియా అక్రిడిటెషన్ కమిటీలో అన్ని సంఘాలకు తగిన ప్రాధాన్యత చర్యలు తీసుకోవాలని వినమ్రంగా కోరారు. ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణించి, మీడియా అక్రిడిటేషన్ ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం, సమాన అవకాశాలు పాటించబడేలా చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్ ను కోరారు.

ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజెఎఫ్ ( హెచ్ 2843), అధ్యక్షులు నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్, కోశాధికారి వేములకొండ రమేష్, ఉపాధ్యక్షులు కందరబోయిన నాగకృష్ణ మరియు మామిడాల కిరణ్, టీబీజేఎ జిల్లా కార్యదర్శి కాసోజు శ్రీధర్, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి కరుణాకర్ సుదగాని, టిడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్షులు గంటేల కుమార్, టీబీజేఎ నగర అధ్యక్షులు ఎలుగోటి వెంకట్, సహాయ కార్యదర్శి చిన్నంశెట్టి రాంబాబు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, రమ్య, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## కాషాయ గర్జనతో మారుమోగిన ఎల్కతుర్తి

**ఎల్కతుర్తి, మే 04( తెలంగాణ ముచ్చట్లు):** పశ్చిమ బెంగాల్, అస్సాం మరియు పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు ఉత్సాహంగా సంబరాలు నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంచుకుంటూ, టపాసులు పేల్చుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మండల అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసమే ఈ విజయానికి కారణమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల వల్లే దేశ వ్యాప్తంగా బీజేపీకి మద్దతు పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ, "మోదీ గారి అభివృద్ధి పథకాలు, అమిత్ షా గారి వ్యూహరచన వల్లనే బీజేపీ జైత్రయాత్ర కొనసాగుతోంది. భవిష్యత్తులో తెలంగాణలో కూడా కాషాయ జెండా ఎగరడం ఖాయం" అని ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ కుడుతాడు చిరంజీవి, సీనియర్ నాయకులు కంచర్ల శంకరయ్య, వెంకటేష్, జనగాని కిష్టయ్య, ఆడెపు శ్రీవర్ధన్, చిదురాల వెంకటేష్, పల్లెపాటి మధుకర్ రావు, మాజీ సర్పంచ్ కదారి ప్రసాద్, నాంపల్లి అశోక్, పెరుగు మధు, కొడం రమేష్, చెదిరం రాకేష్, ఎర్రోళ్ల రాజు, కొలిపాక శ్రీనివాస్, మాటూరి విద్యాసాగర్, రంజిత్, శ్రీనివాస్, దేవరావు, సుఖినే సుధాకర్ రావు, కోమటిపల్లి నాగరాజు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నకిలీ పత్రాల ఫోర్జరీ కేసులో నిందుతుడు అరెస్ట్ రిమాండ్ కు తరలింపు

**ఖమ్మం బ్యూరో, మే 4(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీర్ .నో .289/2026 కేసు లో మోసం, నకిలీ ఫోర్జరీ పత్రాలు అసలైనవిగా ప్రజలను నమ్మించిన కేసులోని ప్రధాన నిందితుడు మమత హాస్పిటల్ రోడ్ నివాసి అయిన నల్లబోలు చంద్రారెడ్డి 45 సం,, సోమవారం ఖమ్మం రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి, న్యాయస్థానం ఎదుట హాజరుపరచి, రిమాండ్ కు తరలించడం జరిగిందని సిఐ రాజు తెలిపారు. పోలీసుల విచారణలో.. నిందితుడు, అతని సహచరులు కలిసి గూర్రాలపాడు గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 52, 72లో "సత్య సంకల్ప వెంచర్" "అభయ టౌన్ షిప్ "పేరుతో లేఅవుట్ ఏర్పాటు చేసి, భూములకు ఎటువంటి చట్టబద్ధమైన నాలా మార్పిడి లేకపోయినా, నకిలీ పత్రాలు తయారు చేసి, ప్రభుత్వ అధికారుల సంతకాలు, ముద్రలను ఫోర్జరీ చేసి, ప్రజలను మోసం చేసినట్లు తేలింది.

నిందితుడు నల్లబోలు చంద్రారెడ్డి తన మాయ మాటలతో మోర్తాల నారాయణ రెడ్డి నుండి రూ.15,00,000/ తీసుకోవడంతో పాటు, గంగావత్ శంకర్, గంగావత్ మహేష్ కుమార్, కుర్ర రవికుమార్, మర్రి మౌనిక, మరికొంత మంది అమాయక ప్రజలను కూడా ఇదే విధంగా మోసం చేసినట్లు విచారణలో వెల్లడైంది. గతంలో కొనుగోలు చేసినటువంటి బాధితులు ఇంటికి బ్యాంక్ లోను రాక, ఇతరులకు అమ్ముకోలేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ కేసులో నిందితుడికి తోడుగా పనిచేసిన మరి కొందరు ప్రస్తుతం పరారీలో ఉన్నారు, వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు కొనసాగుతున్నారు. ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తు కొనసాగుతోంది అని సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజు ఒక ప్రకటనలో తెలియజేశారు

## ప్రతి నిరుపేదకు ఇల్లు.. ప్రభుత్వ ధ్యేయం..

- **నేరడలో ఇందిరమ్మ నూతన గృహ ప్రవేశం లో మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి..**



**ఖమ్మం బ్యూరో, మే 4(తెలంగాణ ముచ్చట్లు ):** రాష్ట్రంలో నిరుపేదలకు పక్కా ఇంద్రమ్మ ఇల్లు నిర్మించి వారి యొక్క కలల సహకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం మండల పరిధిలో నేరడ గ్రామంలో అన్నపురెడ్డి తిరుపతమ్మ పుల్లయ్య దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి హాజరై రిబ్బన్ కట్ చేసి లబ్ధిదారులు గృహప్రవేశ కార్యక్రమం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ఇల్లు లేని నిరుపేదలంటూ లేకుండా చేయడమే ప్రభుత్వం ఉద్దేశమని గత ప్రభుత్వాలతో పోలిస్తే మాయమాటలు చెప్పి పేద ప్రజలను మభ్యపెట్టి ధనికున్ని మరింత పెద్ద ధనవంతుడిగా చేసిందని పేదోని పేదోని లాగనే చేసిందని తెలిపారు. ఆయన అన్నారు వ్యాపారంలో ప్రజలందరూ సమానమేనని ఎందరమ్మ రాజ్యంలో ఇల్లు లేని నిరుపేదలుగా చూడడమే ఈ ప్రజాపాలన ప్రవక్త లక్ష్యం అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు మడిపల్లి భాస్కర్ కిసాన్ సెల్ మండల అధ్యక్షులు కొప్పుల గోవిందరావు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నబోయిన గోపి నేరడ గ్రామ అధ్యక్షులు మంకెన నాగేశ్వరరావు గ్రామ ఉపసర్పంచ్ కోట బాలేష్ పులిపాటి లక్ష్మీపతి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## చేతబడి హడావిడి... నిజం చెబుతున్న డాక్టర్ ప్రభు!



**జమ్మికుంట టౌన్ మే 04 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి నుండి శ్రీరాములపల్లి, మడిపల్లి వైపు వెళ్లే మూడు దారుల కూడలిలో ఆదివారం అర్ధరాత్రి భూత వైద్యుల చర్యలు వెలుగులోకి వచ్చాయి. స్టార్ ఆకారంలో ముగ్గు వేసి, పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, న్యూస్‌పేపర్‌తో మనిషి ఆకారంలో బొమ్మ తయారు చేసి పూజలు నిర్వహించిన ఆనవాళ్లు కనిపించాయి. ఈ దృశ్యాన్ని గమనించిన స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఆ మార్గంలో వెళ్లే ప్రజలకు ప్రమాదం సంభవించే అవకాశం ఉందని భావించి సమాచారం అందించగా, డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు) ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలు భూత వైద్యులను ఆశ్రయించడం దురదృష్టకరమని తెలిపారు. ఇలాంటి అశాస్త్రీయ పద్ధతులకు వేలాది రూపాయలు ఖర్చు చేయడం అజ్ఞానమని విమర్శించారు. ఆర్థిక పరిస్థితులు మెరుగుపడాలంటే కష్టపడి పనిచేయాలని, అనారోగ్య సమస్యలు ఉంటే ఆసుపత్రులకు వెళ్లి వైద్యుల సలహాలు తీసుకోవాలని సూచించారు. మూఢనమ్మకాలకు భయపడకుండా ధైర్యంగా జీవించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.





## ఘనంగా మల్లికార్జునస్వామి ప్రతిష్ఠాపన మహోత్సవం

